# మరో యవ్వనవతి ఆ బారి పడకుండా....

● మట్నూరి సంగమేశం ●

సముద్రపుగాలి తగలాలనే నిర్బంధం వైద్యులు పెట్టకపోతే నేను భీముడుపట్నం వెళ్ళి ఉండను. సాయంత్రం సముద్రపొడ్డున రాళ్ళమీద కూర్చొని చికిత్స పొందడం అలవాటయింది. ఆ వేళకూడా అదేరీతిగా ఓ రాతిబండమీద కూర్చొని ఉన్నాను. హఠాత్తుగా నన్ను, నా చూపుల్ని కూడా వెనక్కి మరలించింది 'హల్లో' అంటూన్న గాత్రం.

చిన్నప్పటి స్నేహితుడు మురళి అప్రయత్నంగా అప్పట్లో దర్శనం యిచ్చినందుకు చాలా సంతోషం కలిగింది. కుశలప్రశ్నలయ్యాక కొండదిగువ బంగాళాలో అతని బస అనికూడా చెప్పాడు, వాళ్ళింటికి అప్పట్లో రాలేనని సాకులు చెప్పడానికి తగినంత కారణం లేకపోయింది.

మురళి బసలోకి సముద్రపుగాలి నేరుగా వస్తుంది, సాయంత్రంతోబు వారింటివేపు పోతే కాలక్షేపమూ అవుతుంది. గాలిపీల్చడమూ జరుగుతుంది. అందుకోసం అనుమతించటంలో అతడుకూడా సంకోచించలేదు.

మే మిద్దరం మాట్లాడుకుంటూన్న గదిలోకే నేరుగా వచ్చేడో క్రొత్తాయన. మురళి కతనితో పరిచయం ఉన్నట్టుంది. లేచి కూర్చోమని కుర్చీ చూపేడు. ఆ విగ్రహాన్ని ఆమూలాగ్రం పరిశీలించేక నాకు రోగం ఉందని, సముద్రపుగాలి పీల్చితీరాలని చెప్పిన వైద్యులు అసత్యవాదులేమో అనిపించింది. అతనికళ్ళు గుంటలుపడ్డాయి. మొఖం ముడుతలు పడింది. నెక్టయితో బంధించిన మెడ నరనరా ఉబికినట్టుంది. సరాయిలో లొటులొటు లాడతాయా అన్నట్టున్నాయి కాళ్ళు. ఆ రూపం అధమం అరవై వసంతా లెరిగిఉంటుంది. తల పండింది.

నన్నాతనికి పరిచయంచేశాడు మురళి. పేరొక రిటైరయిన ప్రభుత్వోద్యోగి అనిన్నీ, విశ్రాంతి జీవితం అక్కడ వెళ్ళబుచ్చుతున్నారనిన్నీ నాతో చెప్పాడు. మమ్మల్నిద్దర్నీ ఆ మర్నాడతని పుట్టిన దినమని, టీపార్టీకి విధిగా రావలసిందని ఆహ్వానించి ఆ వ్యక్తి సెలవు పుచ్చుకొన్నాడు.

అరవై ఏళ్ళు గడిచిన యీ మనిషికి పుట్టినదినం పండుగేమిటా అని నేనూ దిగ్భ్రమ చెందాను, తెల్లబోయి నన్ను నే నమ్మలేని స్థితిలో ఉంటే 'ఇతనిదో వింతఅయిన చరిత్ర సుమా' అన్నాడు మురళి. ఏమిటా వింత అనే ప్రశ్న అవసరం లేకుండానే ప్రారంభించేడు చెప్పడానికి.

తన జీవితంలో రెండుసార్లు పెళ్ళిపీటలమీద హారతులు గొని, యిద్దరి భార్యలయందు యిద్దరు మగపిల్లల్ని కని ముచ్చటగా మూడోసారి వరుడై, రిటైరయి, క్రొత్తభార్యతో కులుకుతూన్న వ్యక్తి యీ అపరిచితుడు, తన తొలిసంబంధం కొడుకులిద్దరూ అన్యత్రా ఉద్యోగాల్లో ఉంటే నూత్న దాంపత్యానందాన్ని నిరవశేషంగా అనుభవిస్తున్న భోగి. ముచ్చటగా పెండ్లాడిన మూడవసారి మాత్రం ముప్పైఏండ్ల బాలవితంతువును ఉద్ధరించిన పుణ్యమూర్తి.

ఇంతకంటె ఎక్కువగా తెలుసుకోవలసిన అవసరంకూడా మరి లేదు. కళ్యాణి కళ్లు మసకలు క్రమ్మిన యీ మహనీయుణ్ణి స్వయంవరించిన ఆ పునర్భువుని చూడాలనే కుతూహలం మాత్రం కలిగింది.

ఆ అదృష్టంకూడా ఆ మర్నాడే ప్రాప్తించింది. చిక్కి శల్యావశిష్టమయి రోగంతో పందెం వేస్తూన్న కంఠసీమలో చెక్కిరించినట్టు ప్రేళ్ళాడుతూన్న బంగారు గొలుసుతో ఉన్న పండీపండని శిరోజాలు గల, ఆ విగ్రహం ఆ యిల్లు మూడవసారి పావనంచేసిన యిల్లాలు. ఆమె కళ్ళల్లో నూత్న వధువుకి వలె ఉత్సాహంగాని, ఉన్మత్తతగాని కన

### — లిప్‌స్టిక్ ప్రమాదాలు —




పడవు. ఆ ముఖంలో విషాద నిర్భరమయిన రేఖలుకూడా ఉన్నాయి. కొంత శ్రమ, విసువు, నిరుత్సాహం, దైన్యం, బలవంతపు ఆనందంకూడా ఓ క్షణంలో ఆమె ముఖంలో గోచరిస్తాయి. విధి లేక పసుపురాసిన ముఖంగాని, విలాసానికి స్నో రాసిన ముఖం మాత్రం కాదనిపిస్తుంది.

టీపార్టీ అయిన తర్వాత మాకు పరిచయం జాస్తీ అయింది. మా మేనత్త, నాకు సంరక్షణ కోసం నాతో సముద్రపుగాలి సేవించే అదృష్టవంతురాలు, తను చిన్నతనంలో తల చెడినదవటం వల్ల, యీ కొత్తగా పునిస్త్రీ అయిన ఆమెతో స్నేహం కలిపి రోజూ ఓ సారి ఆమెనిచూచి వస్తూఉండేది. మొదట్లో ఆమెని వెక్కిరిద్దామనే దురుద్దేశంతో ప్రారంభించినా, చివరికి ఆమె స్నేహం సానుభూతికి త్రోవదీసింది. తడవ తడవల వారింటికెళ్ళి మాట్లాడినప్పుడల్లా ఖండఖండాలుగా గ్రహించిన ఆమెచరిత్ర నాకో నాడు తెలియజేసింది.

తల్లిదండ్రులచాటున ఎనిమిదోఏటినుంచి వైధవ్యాన్ని పోషించుకొన్న పుణ్యాత్మురాలామె. అప్పట్లో తానెన్నడూ మాని ఎరగని ఆ దివంగతుడైన భర్త ఆమెకి దేవుడు. ఆమె మనసా వాచా కర్మణా అతనికి అర్పింపబడ్డ ఆత్మ. అతని ఆయువుకూడా పోసుకొని, అతని పేరుగా యిక్కడ నిల్చిన ప్రతినిధి.

తల్లిదండ్రు లిద్దరూ గతించాక ఆమె అనాథ అన్న సంగతి ఆమెకి స్పష్టం అయింది. అందులోనూ తనే తండ్రి చావుకి కారణం అనికూడా వదినగారు నిందించినమీదట ఆ యింట్లో ఉండడం కూడా దుర్భరంగానే కనిపించింది. మొదట్లో ధ్వనిపూర్వకంగానూ తరువాత తరువాత ప్రత్యక్షంగాను కాసినూ చాకిరీ చేయించుకొంటూన్న వదినగార్లకి ఆమె కింత తిండి పెట్టడంకూడా కంటసంగానే ఉందన్న సంగతికూడా స్పష్టం ఐంది. పైత్రుకమైన స్థిరాస్తితో కాలం గడుపుతూన్న అన్నదమ్ములకి ఆమె కింత తిండి బట్ట యివ్వడాని కెందుకింత కష్టంగా ఉందో ఆమె అర్థం చేసుకోలేకపోయింది. పెద్దవదినగారి పుణ్యమా అని అన్నగారి మనస్సులో చెల్లెలికి పునర్వివాహం చెయ్యాలనే పట్టుదల, సంస్కారణాభిలాష ప్రబలం అయ్యేయి. తన కిష్టం లేకపోయినా, ఆ సంగతి సుస్పష్టంగా చెప్పినా, అవన్నీ వదినగార్ల వ్యాఖ్యానాల్లో లజ్జావశంవల్ల అన్నమాటలుగా పరిగణించబడి, తననీ అరవైయేళ్ళ పెళ్ళికొడుక్కి అర్ధాంగిగా అప్పగించాయి.

ఆమె హృదయంలో యీ విచిత్ర పరిణామం పొందిన జీవితంపట్ల ఆనందంగాని, ఆక్రోశంగాని ఉన్నాయా అంటే అవి ఆమె గంభీరముద్రలో సులువుగా పొడగట్టవు. యౌవ్వనాంతాన్న బలవంతంగా వచ్చిన దాంపత్యాన్ని స్వాగతపూర్వకంగా కాకపోయినా సానుభూతిపూర్వకంగానైనా ఆమె స్వీకరించిందనుకోవచ్చును. అప్పటికి జీవనాధారం అయిన ఆ వరుడుకూడా ఆమె గౌరవానికి పాత్రుడుకూడా కావచ్చును. అప్పట్లో పెళ్ళాడమనే స్థిరసంకల్పం కల్గిన ఆ మహామహుడికి ఆపదలో అడ్డుపడి, మరో యౌవనవతిని ఆ దారిపడకుండా రక్షించి అతణ్ణా పాపం నుంచి ఉద్ధరించిన పుణ్యాత్మురాలని మాత్రం నాకు తోచింది.

నేను స్వస్థుణ్ణై సముద్రపొడ్డు విడిచిన సంవత్సరానికల్లా మురళి ఉత్తరంలో మళ్లా ఆ పుణ్య దంపతుల ప్రస్తావన వచ్చింది. అతను ఘడియలు లెక్కపెడుతున్నాడనీ, తొలి సంబంధపుకొడుకు లాస్తి వ్రాయించుకొన్నారనీ, ఆమె స్థితి మరీ అంధకారబంధురం అవబోతూందనిన్నీ వ్రాసిన పంక్తులు చూచేక నాకు విచారం, చికాకు, జీవితంమీద అసహ్యంకూడా కలిగాయి. భగవంతుడే చూడలేకపోయిన ఆమెని మరొకరుద్ధరించగలరా! అని మాత్రం నిస్పృహ కల్గింది.